# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశ భక్తికి, స్వాతంత్ర పోరాట స్ఫూర్తికి ప్రతీక వందేమాతరం గీతమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **ఆంధ్ర ప్రదేశ్ ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే దిశగా లక్షా, ఒక వెయ్యి 899 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది.**

3. **తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.**

4. **కృష్ణా జిల్లా, మచిలీపట్నం నగర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, దశల వారీగా పనులు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు భూగర్భవనరులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.**

5. **ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తెలంగాణ నిలిచిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు.**

==========================

దేశ భక్తికి, స్వాతంత్ర పోరాట స్ఫూర్తికి ప్రతీక వందేమాతరం గీతమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కోట్లాది మంది భారతీయుల్ని ఏకం చేసే ఏకైక నినాదం వందేమాతరం అని వెల్లడించారు. వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా ప్రజలకు సందేశాన్ని ఇచ్చారు. దేశం ప్రపంచంలో మొదటి స్థానంలో నిలవాలంటే వందేమాతరం స్ఫూర్తిని కొనసాగిచాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్... 32 సెకన్లు

వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌లలో, విద్యా సంస్థల్లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ గీతాన్ని రచించిన బంకిం చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే దిశగా లక్షా, ఒక వెయ్యి 899 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో బోర్డు సమావేశం నిన్న జరిగింది. కొత్తగా 26 పారిశ్రామిక ప్రతిపాదనలకు అంగీకారం తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 85 వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ .... రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్ర స్థానంలో నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. క్లస్టర్ వారీగా 3 మెగా సిటీలు, 15 పారిశ్రామిక జోన్లుగా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి జరగనున్నదని పేర్కొన్నారు.

---------------------------

తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. తుఫాను వంటి పకృతి వైపరిత్యాలను ఎదుర్కోవడంలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, అగ్నిమాపక అధికారులు ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. బాపట్ల జిల్లా, చీరాలలో 2 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న అగ్నిమాపక కేంద్రానికి మంత్రి నిన్న భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్...32 సెకన్లు

---------------------------

కృష్ణా జిల్లా, మచిలీపట్నం నగర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, దశల వారీగా పనులు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు భూగర్భవనరులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన నిన్న శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షపు నీరు చేరి రహదారులు ముంపుకు గురవుతున్న నేపథ్యంలో రహదారుల అభివృద్ధి, పైపు లైన్ ఏర్పాటు పనులు ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

---------------------------

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తెలంగాణ నిలిచిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఎండీ డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని పారిశ్రామికవేత్తల బృందం హైదరాబాదులోని సచివాలయంలో మంత్రిని నిన్న కలిసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన రాష్ట్రమని పేర్కొన్నారు.

---------------------------

దేశ ఐక్యతకు ఏనలేని కృషి చేసిన సర్దార్ వల్లభ భాయ్ పటేల్ 150వ జయింతి సందర్భంగా కొనసాగుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో జాతీయ సమైక్యత ర్యాలీని నిన్న నిర్వహించారు. కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని మేరా భారత్ విభాగం, జాతీయ సేవా పథకం జిల్లా శాఖలు సంయుక్తంగా నిన్న ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి, జాతీయ ఐక్యత యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర కన్వీనర్, ఎచ్చెర్ల శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ..

సర్దార్ వల్లభ భాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలపై యువతకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి ప్రతిపాదిత 6 లైన్ల వివరణాత్మక నివేదికలో అవసరమైన మార్పులను చేయాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. ఈ రహదారి నిర్మాణంపై అధికారులతో రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ప్రతిపాదిత వివరణాత్మక నివేదికలో బెంజిసర్కిల్ నుంచి భవిష్యత్తులో నిర్మించనున్న అవుటర్ రింగ్ రోడ్డు వరకూ ఎటువంటి పై వంతెనల ప్రస్తావన లేకపోవడంపై మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికంగా ప్రజాప్రతినిధులు, కలెక్టర్ నుంచి వచ్చిన ప్రతిపాదనను పరిశీలించాలని అధికారును మంత్రి ఆదేశించారు.

---------------------------

తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త భక్త కనకదాస జయంతి ఈ రోజు. కర్ణాటక సంగీతం కోసం కన్నడ భాషలో రచించిన కీర్తనలు, రచనలతో ప్రాచుర్యం పొందాడు. కర్ణాటక రాష్ట్రంలో హవేరీ జిల్లా, బాద గ్రామంలో బీరప్ప, బాచమ్మ దంపతులకు కనకదాసు 1509లో జన్మించారు.

---------------------------

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టు టి 20 సిరీస్ లో భాగంగా 5వ మ్యాచ్ ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరం, గాబా స్టేడియంలో ఈ రోజు జరగనుంది. ఈ మ్యాచ్ లో భారత జట్టు ఆస్ట్రేలియా జట్టుతో పోటీ పడనుంది. స్థానిక కాలమానం ప్రకారం ఈరోజు సాయంకాలం 6 గంటల 15 నిముషాలకు ప్రారంభం అవుతుంది.

---------------------------

దక్షిణ అంతర కర్ణాటక మరియు దాని పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతా వరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తా, యానాంలో ఈరోజు, రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్ 20 సెకన్లు

తెలంగాణలోనూ రానున్న రెండు రోజుల పాటు పలు జిల్లాలలో తేలికపాటి వర్షాలు, కొన్ని ప్రాంతాలలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================